


తిరుచానూరు పంచాయతీ ఈవో బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుచానూరు



తిరుచానూరు గ్రామపంచాయతీకి నూతన ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి గా కే.సురేంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. శెట్టిపల్లి గ్రామపంచాయతీ లో పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి పి లక్ష్మీనారాయణ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కి వ్యక్తిగత కార్యదర్శిగా నియమితులయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఇంఛార్జి పంచాయతీ కార్యదర్శి కే సురేంద్ర రావు మాట్లాడుతూ తిరుచానూరు పంచాయతీ ప్రజలకు ఎటువంటి సమస్య కలిగిన సత్వరం పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత తరువాత...

వేతనాలెక్కడ..?



104 ఉద్యోగులకు 3 నెలలుగా అందని జీతాలు

ప్రజాశక్తి -తొట్టంబేడు

గ్రామీణ,పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజిషియన్ పేరుతో ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 104 ఏం.ఏం.యు వాహన సేవలను 2008 వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రధాన ప్రతిపక్ష నేతగా ప్రజా సంకల్పయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 104 ఎం.ఎం.యు వాహన ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని, వేతనాల పెంపు అమలు చేస్తానని ఉద్యోగుల కుటుంబాల్లో చిరునవ్వులు చిందిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ అమలకై 2019, అక్టోబర్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి నేరుగా తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకొని 104 సంఘ ప్రతి నిధులతో చర్చలు జరిపి వేతనాలు పెంపు అమలుచేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏ.పీ.సి.ఓ.ఎస్ లో నేరుగా విలీనం చేయాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు .రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తున్న డ్రైవర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఉద్యోగులను ముఖ్యమంత్రి హామీ మేరకు నేరుగా కాంట్రాక్ట్ ఏ.పి.ఓ.ఎస్ లో అబ్జార్బ్ చేసిన ముఖ్యమంత్రి హామీలు నెరవేర్చి ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పర్యవేక్షణలో గతంలో వలె జిల్లా మెజిస్ట్రేట్ కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆధీనంలో 104 ఎంఎంయూ సేవలను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ శ్రీహరిని 104 డ్రైవర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, జిల్లా కార్యదర్శి దివాకర్ ,ప్రభావతి, భువనేశ్వరి, కిరణ్, దీప, రఘు, రవి, శంకర్ తదితరలు పాల్గొన్నారు.



14న గ్రూప్ 2 అభ్యర్ధులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతిలో గ్రూప్ 2 అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సిలబస్‌ను తయారుచేసింది. ఈ పోటీ పరీక్షలకు వంద పేజీల మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నట్లు డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. జయచంద్ర పేర్కొన్నారు. నిపుణులు, కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణ్‌రావు నేతృత్వంలో ఈ అవగాహనా సదస్సు జరగనుంది. సదస్సు శ్రీ విద్యా అకాడమీ పురంధేశ్వరి కాంప్లెక్స్‌లో ఆదివారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. పురంధరేశ్వరి కాంప్లెక్స్ శ్రీ విద్య ఐఎఎస్ అకాడమీ హాల్లో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సదస్సును డివైఎఫ్ఐ, శ్రీ విద్య ఐఎఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరగనుంది. జిల్లా కార్యదర్శి కె.సుమన్, చరణ్, ఐఎఎస్ అకాడమీ ఎవో వినోద్,గ్రూప్ 2 అభ్యర్థులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు కింది నెంబర్లను7674819159, 9491311169, 9494891414 సంప్రదించాలని కోరారు.



నరువి ఆసుపత్రిలో రేడియాలజీ పీజీ కోర్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వేలూరులోని నరువి ఆసుపత్రిలో అనెస్తిషియాలజీ, రేడియోలజీ పీజీ కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆసుపత్రి ఛైర్మెన్ డాక్టర్ జీవి సంపత్ తెలిపారు. దీనికి సంబంధించిన అప్రూవల్ లెటర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందజేశారు. డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు కార్యక్రమం ద్వారా ఇద్దరు స్టూడెంట్లను చేర్చుకుంటామన్నారు. అయితే అడ్మిషన్లను నీట్–పీజీ ఫలితాలను అనుసరించి కౌన్సిలింగ్ ద్వారా చేపడుతామని అన్నారు. ఇంకా నరువి ఆసుపత్రి పీజీ కోర్సులను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే ఆమోదం పొందినట్లు తెలిపారు. దీనికి ముందు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి నిపుణుల కమిటీ వచ్చి ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. మౌలిక సదుపాయాలు, పరికరాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారని, తరువాత అప్రూవల్ లెటర్ అందజేసినట్లు తెలిపారు.

మహాద్భుతంగా గంగజాతర : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీ తాతయ్య గుంట గంగమ్మజాతరలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తమ కుటుంబ సభ్యులతో కలసి, ఊరేగింపుగా విచ్చేసి గంగమ్మ తల్లికి సారె సమర్పించారని స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే గంగమ్మ ఆలయం వద్ద మీడియా తో మాట్లాడుతూ తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర ఊహకు అందని విధంగా జరుగుతోందని సంతోషాన్ని వ్యక్తపరిచారు. తిరుమలలో జరిగే శ్రీ వారి బ్రహ్మోత్సవాల తరహాలో గంగమ్మ జాతర మహాద్భుతంగా జరుగుతుందని పునరుద్ఘాటించారు. ఏ కార్యక్రమానికైనా ప్రమోషన్ అవసరమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా గంగమ్మ జాతర ప్రాశస్త్యం, చరిత్ర, విశిష్టత గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లామన్న సంతప్తి తమకు కలిగిందని, అందుకు అనుగుణంగానే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి గుడికి విచ్చేస్తున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయరెడ్డి పాల్గొన్నారు. కమిషనర్ హరిత ఐఎఎస్ మాట్లాడుతూ కుటుంబ సమేతంగా సంప్రదాయంగా గంగమ్మ జాతరలో సారె సమర్పించడం తమ అదష్టమని, ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచార సంప్రదాయం కొనసాగిస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో పుట్టినప్పటి నుండి ప్రతి సంవత్సరం గంగమ్మకు వేషాలు వేస్తూ, జాతర జరుపుకుంట్టున్నామని, ఈ సంవత్సరం తిరుపతి జాతరలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గా పాల్గొనడం అమ్మవారి కపేనన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సారెను మధ్యాహ్నం మూడు గంటలకు తీసుకొస్తామని, సిబ్బంది అందరూ పాల్గొనాలని కోరారు.



బండవేషాలతో భక్తుల సందడి

తాతయ్యగుంట గంగమ్మజాతరలో భాగంగా గురువారం చిన్నారులు బండవేషాలు ధరించి ఆలయం వద్దసందడి చేశారు. మూడోరోజు బండ వేషం, నాలుగో రోజు తోటి వేషం వేసుకుంటారు. తోటి వేషంలో భాగంగా ఒంటిపై మసి బొగ్గు పూసుకుని, తెల్లని నామం, కనుబొమ్మలపైన చుక్కలు పెట్టుకోవడం సంప్రదాయం. చిన్నపిల్లలు మీసాలను ధరిస్తారు. తలపై వేపాకు మండలు, పాతపొరక చేతబట్టి వీధుల్లో సంచరిస్తూ వేషాలమ్మ తల్లి ఆలయానికి చేరుకుంటారు.అక్కడనుంచితాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటారు.

మొదటి ఫేజ్ రీసర్వేలో హద్దురాళ్లు నాటాలి : జేసీ

తిరుపతి టౌన్ : జిల్లాలో ఆయా గ్రామాలలో నిర్దేశించుకున్న గడువులోగా హద్దు రాళ్లు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం విజయవాడ సి.సి.ఎల్.ఏ. కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సర్వే రాళ్ల నాటే ప్రక్రియ, భూ హక్కు పత్రాల పంపిణీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డి. కె. బాలాజీ, డి. ఆర్. ఓ శ్రీనివాసరావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి దశ లో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే రాళ్ళు నాటడం, ఖాతాలకు ఫోటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేసి పూర్తిచేయాలని తెలిపారు. సర్వే రాళ్ళు నాటే ప్రక్రియలో సంబంధిత అధికారులు ప్రతిరోజు సమీక్షించి లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పత్రాల పంపిణికి పనుల పై సంబంధిత అధికారులు దష్టి పెట్టి పూర్తిచేయాలని అన్నారు.

ప్లాట్ నంబర్ 77కు అర్హులు ఎవరు? : సిపిఎం

ప్రజాశక్తి - రేణిగుంట

పంచాయతీకి చెందిన వివేకానంద కాలనీ నందు సర్వే నెంబర్.769ఎ2లో ప్లాట్ నంబర్ 77 ఇంటి స్థలానికి అర్హులు ఎవరో తేల్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ డిప్యూటీ తహశీల్దార్ భానుప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ప్లాట్ నంబర్ 77 ఇంటి స్థలంలో పెంచలయ్య, చక్రవర్తి మధ్య వివాదం నడుస్తోందని, అయితే ఈ స్థలానికి సంబంధించి సిపిఎంకు చెందిన టి.నరసింహారెడ్డి ప్రమేయం ఉందని ఎంపి ప్రసాద్ ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. కాలనీ మొత్తం విచారించి అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? అనేది తేల్చాలని సిపిఎం మండల కార్యదర్శి కె.హరినాథ్, మండల నాయకులు టి.నరసింహారెడ్డి పేర్కొన్నారు.



సిపిఎంకు సంబంధించిన వ్యక్తులు ఎవరైనా అక్రమ పద్ధతిలో ఆక్రమించుకుని ఉంటే తమ పార్టీ ప్రోత్సహించదని, అటువంటివారిపై రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నా తమ పార్టీకి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. తహశీల్దార్ శివప్రసాద్ స్పందించి తమ పార్టీపైన దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జా చేసేవారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


5.2 కేజీల బంగారు బిస్కెట్లు పట్టివేత

నలుగురు అరెస్టు- రెండు కార్లు సీజ్

ప్రజాశక్తి.- దొరవారిసత్రం

ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండా చెన్నై నుండి పల్నాడు జిల్లా నరసరావుపేటకు 5.2 కేజీల బంగారు బిస్కెట్లను కారులో తీసుకెళ్తున్న నలుగురు వ్యక్తులను తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద పోలీస్ శాఖ వారు వాహనాలను బుధవారం తనిఖీ చేస్తూ పట్టుకున్నారు. గురువారం నాయుడుపేట డి.ఎస్.పి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి రాజగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ బుధవారం నాయుడుపేట సీఐ సోమయ్య, సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, దొరవారిసత్రం ఎస్సై తిరుమలరావు, తడ ఎస్సై శ్రీనివాసరెడ్డి లు తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తూ ఉండగా రెండు కారుల్లో ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండా 2.5 కోట్లు విలువచేసే 5.2 కేజీలు బంగారు బిస్కెట్లు గుర్తించి నలుగురు వ్యక్తులను, బంగారు బిస్కెట్లను రెండు కార్లను స్వాధీనపరుచుకున్నారు. ఈ నలుగురు వ్యక్తులు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన వెంకట్ సుమంత్, దిలీప్ వెంకట్, సాయికుమార్, రాజులుగా గుర్తించి వారిని గురువారం అరెస్టు చేసి కోర్టుకి పంపుతున్నట్లు తెలిపారు.కేసు నమోదు చేసి, పట్టుబడిన





బంగారాన్ని కస్టమ్స్ అధికారులకు అప్పగించనున్నట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించినందుకు నాయుడుపేట సీఐ సోమయ్యను, సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర్లురెడ్డి, దొరవారిసత్రం ఎస్సై తిరుమలరావును, తడ ఎస్సై శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

పంట నష్టం పరిశీలన

పాకాల : మండలంలోని పుదిపట్లబైలులో వర్షాల కారణంగా దెబ్బతిన్న టోమాటో, మామిడి పంటల నష్టాన్ని క్షేత్రస్థాయిలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ బి.సరస్వతి, తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి బి.దశరదరామిరెడ్డి గురువారం పరిశీలించారు. ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ ఉద్యాన శాఖ ద్వారా రైతు సంఘాలు నిర్మించుకునే కలెక్షన్ సెంటర్స్ ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, గ్రామ ఉద్యాన సయాయకురాలు వనజ పాల్గొన్నారు.

సరికొత్త రుచులతో ఆహ్వానం

నేడే 'లీలాస్పైసి' ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)



సరికొత్త రుచులతో 'లీలాస్పైసి' ఆహ్వానం పలుకుతోంది.. శుక్రవారం ఈ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎన్ఎస్ హోటల్ అండ్ రిసార్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.బాల శ్రీనివాసులు చెప్పారు. తిరుపతి–కరకంబాడి మార్గంలోని ఉపాధ్యాయ నగర్ ప్రారంభ మార్గం అక్కారం పల్లి కూడలి వద్ద నూతనంగా మల్టీకుషన్ రెస్టారెంట్‌ను ప్రారంభించనున్నారు. తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ రెడ్డి, ముద్ర నారాయణ, డాలర్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారన్నారు. లీలా స్పైసి రెస్టారెంట్‌లో మాంసాహార ప్రియులకు నూతన రుచులు అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం టిఫిన్ సమయంలో చేపల పులుసు, చేపల వేపుడు, పాయ, బట్టర్ పాయ, ఘీపాయ, చికెన్, నాటుకోడి, మటన్, స్పెషల్ ఇడ్లీ, ఘీ దోశ, స్పెషల్ అప్పం, అలానే మధ్యాహ్నం హైదరాబాద్ బిర్యానీ, మొఘలాయి బిర్యాని, మటన్ బిర్యానీ, ఫిష్ బిర్యానీ, ప్రాన్స్ బిర్యానీ, ఫింగర్ ఫిష్, బట్టర్ ఫిష్, నెల్లూరు రొయ్యల వేపుడు, హాంకాంగ్ చికెన్, బొమ్మిడాయిల పులుసు, తందూరి ఫుల్ ఫిష్, నల్లకొస బిర్యానితో పాటుగా రెస్టారెంట్ ప్రత్యేక ఐటమ్స్ గా లీలా స్పైసి ఫ్రైడ్ చికెన్, బూటాని చికెన్, మహారాణి మటన్ వేపుడు, మటన్ చుక్కా, గోంగూర మటన్ ఇలా అనేక రకాల రుచులను మాంసాహార ప్రియులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. తిరుపతి నగర వాసులే కాకుండా తిరుపతికి వచ్చే యాత్రికులకు తమ రెస్టారెంట్ ద్వారా నూతన రుచులను అందించి తప్తి పరచనున్నామన్నారు.



మండు వేసవిలో నోరూరించే... ముంజలు...!





ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు ఊహించని స్థాయిలో పెరిగి ప్రజలను ఒకింత భయానికి గురిచేస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా 40 డిగ్రీలకు పైబడి భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో పగటిపూట రోడ్లపై అక్కడక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. సాధారణంగా వేసవి అంటేనే ఉక్కపోతలు, అధిక ఉష్ణోగ్రతల నుండి ప్రజలు ఉపశమనం పొందడానికి చల్లటి ద్రావణాలు, పుచ్చకాయ, మజ్జిగ, నిమ్మరసం వంటివి వినియోగిస్తారు. అలాగే సీజన్ పరంగా లభ్యమయ్యే 'ముంజలు' తీసుకొని శరీరంలో అధిక ఉష్ణోగ్రతల నుండి ఉపశమనం పొందుతారు. ఇలా శరీరంలోని అధిక వేడి ఉష్ణోగ్రతను తగ్గించడంలో ముంజే ముందంజగా వినియోగ ప్రాచుర్యాన్ని అందుకుంది. గడిచిన సంవత్సరాలతో పోల్చుకుంటే భూమిపై అధిక ఉష్ణోగ్రతలు క్రమేపి పెరుగుతున్నాయని, ఇందుకు కారణం భూమిపై తరుగుతున్న అడవులు, కాలుష్యం, అధిక సంఖ్యలో వాహనాల వినియోగంగా చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో శరీరంలో ఏర్పడే అధిక వేడిని నియంత్రించడంలో ప్రజలుపయోగించే ' నీరా ' ను అందరికీ అందుబాటులో ఉండే విధంగా తెలంగాణ ప్రభుత్వమే నీరాక్ కేఫ్ ను ఏర్పాటు చేసింది. తాటి చెట్ల నుండి లభ్యమయ్యే ముంజలను ప్రజలకు విక్రయించడానికి ప్రాంతాలవారీగా (20 నుండి 30 చెట్లును కటవ అంటారు) కటవను కొన్ని నెలలకు విక్రయదారులు పాడుకుంటారు. మిగిలిన రోజుల్లో తాటి చెట్లనుండి కల్లు తీస్తూ దాన్ని విక్రయిస్తుంటారు. తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతాల నుండి ముంజలను తీసుకువచ్చి సమీపంలోని నగరాలు, పట్టణాలలో ప్రజలకు అమ్ముకుని ఉపాధి పొందుతారు కొంతమంది మహిళలు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయ కూడలిలో ముంజల తట్టపై కానుగ ఆకుగప్పి ఉదయం 11 గంటల నుండి విక్రయాలు మొదలుపెట్టి సాయంత్రం వరకు అమ్మకాలు జరిపి తిరిగి ఇంటికి పయనమవుతారు. నెలకు నాలుగు వేల నుండి ఐదువేల రూపాయలు వరకు ఈ కటవ ధర పలుకుతుంది.

ముంజగా మలచాలంటే అంత సులువేమికాదు

తాటి చెట్టుకు ఉన్న కాయను కోసి వాటిని వలచి ముంజగా తీస్తారు. ఇదీ ఖర్చుతో కూడుకున్నదే. చెట్టు నుండి కాయ దించేవారికి, కాయను ఒలిచి ముంజగా చేసేవారికి 400 రూపాయలు లెక్కన ఇస్తామని విక్రయదారులు చెబుతున్నారు.

లగేజ్ భారాలు కట్టాల్సిందే

గ్రామీణ ప్రాంతాల నుండి సేకరించిన ముంజలను పట్టణాలలో నగరాల్లో విక్రయించుకోవడానికి ఆర్టీసీ బస్సుల్లో లగేజ్ చార్జీని వసూలు చేస్తారని, ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలో నిలబడి దజను ముంజలను 70 నుంచి 80 రూపాయల ధర పెట్టి దారిలో వాహనాలపై వెళ్లే వారికి, పాదచారులకు అమ్ముతుంటారు. ఒక్కోసారి అమ్ముడు పోతుంటాయి. ఒకవేళ అమ్ముడుపోలేదంటే నష్టపోవాల్సిందే.

ప్రభుత్వ పాఠశాల్లో మెరిసిన ఆణిముత్యాలు

ప్రజాశక్తి-వెంకటగిరి



ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో తమ ప్రతిభను కనబరిచి మెరిసారు. మండల పరిధిలోని పంజాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు కూనాటి పావని ఇటీవల జరిగిన సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్షల్లో 50మార్కులకు గాను 49మార్కులు సాధించి జిల్లాలోనే ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిగా గుర్తింపు సాధించారు. బిసి గురుకుల ప్రవేశ పరీక్షల్లో 47 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఆదినారాయణ విద్యార్థిని కొనియాడారు. తమ పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించారన్నారు. కె.పావని 49, కె.జోష్నప్రియ 44, జ్ఞానేశ్వరి 39, చెంచుభువన 39, పి.రిషికేష్ 31, పి.పావని 30 మార్కులు సాధించి గురుకులాల్లో సీట్లు సాధించారన్నారు.

స్వర్ణరథంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు

ప్రజాశక్తి - చంద్రగిరి

శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి స్వర్ణరథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఈఈ 2 ప్రసాద్, ఎఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'వెటర్నరీ వర్సిటీ' విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించాలి

క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించాలని వైస్ ఛాన్సలర్ పద్మనాభం రెడ్డికి ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల రాష్ట్రంలో ఉండే అన్ని విశ్వ విద్యాలయాలలో విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు.వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ మూడు రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ వింగ్ కార్యదర్శి చంద్రనాయక్, క్యాంపస్ ఉపాధ్యక్షులు నవీన్, రంజిత్ పాల్గొన్నారు.




దళితుల అభివృద్ధి టిడిపిలోనే : నెలవల

దొరవారిసత్రం : రాష్ట్రంలో దళితులు అభివద్ధి చెందింది తెలుగుదేశం పార్టీ పాలనలోనే అని సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. గురువారం దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివద్ధి పథకాలు అందేవని, పేదవాని జీవితం సంతోషంగా సాగేదన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జకరయ్య మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశ్రాంతి హెడ్‌మాస్టర్ మృతికి నివాళి

పుత్తూరు టౌన్ : రాచపాళెంకు చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ శింగరాజు చెంగల్ రాజు అనారోగ్యంతో మతి చెందారు. విషయం తెలుసుకున్న నగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ రాచపాలెం గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఆ వార్డు కౌన్సిలర్ బసంతి, శల్య వైద్య నిపుణులు బాలసుబ్రమణ్యం రాజు పాల్గొన్నారు.



కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - కెవిబిపురం

కేవిబి పురం మండలంలోని మారుమూల ప్రాంతమైన వగత్తూరు గ్రామంలో ప్రజల సౌకర్యం కొరకు 1987 లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అవి ఇప్పుడు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏ నిమిషంలో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. ఇటీవల అకాల వర్షాలకు తోడు పెనుగాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలకు సమీపంలోని వారు భయాందోళన చెందుతున్నారు. స్తంభాలను మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

సేవకు మారుపేరు 'నర్సు'

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రోగులకు వైద్యులు ఇచ్చే ఔషదం ఎంత ముఖ్యమో.. నర్సులు చేసే సేవలూ అంతే ముఖ్యం. సేవకు మరో రూపం నర్సు. అలాంటి నర్సులకు ఆదర్శనీయులు ఫ్లోరెన్స్ నైటింగేల్. యుద్ధం సమయంలో ఆమె చేసిన సేవల వల్ల ఎంతో మంది సైనికుల ప్రాణాలు నిలిచాయి. సేవకు ప్రతిరూపంగా నిలిచింది. ఆమె సేవలకు గుర్తుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. మే 12 అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఒక రోగి నుంచి మరొక రోగి, ఇంకొక్క రోగికి ఇలా వాళ్లు ఎపుడూ తమ సేవలను అందించే బాధ్యతను నిర్వహిస్తారు. రోగులే తమ పిల్లలుగా భావిస్తూ నర్సులు అహోరాత్రులు శ్రమిస్తారు. అటు డాక్టర్లకు, ఇటు రోగులకు వాళ్లు నిత్యం అందుబాటులో ఉండాల్సిందే. ఆసుపత్రుల్లో నర్సులు చేసే పని ఎంతో కీలకమైనది. రోగులకు సేవ అందంచడానికి నర్సులు ఎంతో కృషి చేస్తారు. కానీ వాళ్ల పనిని ఎవరూ గమనించరు. కేవలం డాక్టరు చేసే విధులను మాత్రమే చాలా మంది పరిగణనలోనికి తీసుకుంటారు. అందుకే నర్సులను చిన్నచూపు చూస్తారు. కానీ నర్సులకు ఉండే ముఖ్యమైన బాధ్యతల గురించి అందిరికి తెలియదు.

నైటింగేల్ సేవలు

నర్సులకు ఆదర్శనీయులైన ఫ్లోరెన్స్ నైటింగేల్ విల్లియం ఎడ్వర్డ్ షోర్, నైటింగేల్ నీ స్మిత్ దంపతులకు 1812 మే 12న ఇటలీలో పుట్టింది. తల్లి ఫానీ నైటింగేల్ చాలా అందగత్తె. ఫ్లోరెన్స్‌కు ఒక అక్క ఉండేది. తండ్రితో పాటు అక్కచెల్లెళ్లు ఇద్దరు ఊర్లు తిరిగేవారు. ఆ రోజుల్లో ఆసుపత్రులు అధ్వాన స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత ఏ మాత్రం ఉండేవి కావు. అయినా ఫ్లోరెన్స్ నర్సింగ్ పని చేసేందుకు నిశ్చయించుకుంది. తల్లి సాహితి ప్రపంచంలో ధృవతారగా ఎదగాలని కోరినా నిరాకరించింది. ఇద్దరు బిడ్డలను దత్తతు తీసుకుని పెంచడం మొదలు పెట్టింది. 1852లో ఐర్లాండ్ వెళ్లింది. అక్కడ ఆసుపత్రులు చూసి వాటిలో విప్లవాత్మక మార్పులు తేవాలనుకుంది. 1853లో సిస్టర్ ఆఫ్ ఛారిటికి వెళ్లింది. తిరిగి లండన్‌కు వచ్చి తన నానమ్మకు సేవ చేయడానికి వెళ్లింది. అక్కడ కలరా వ్యాపించింది. వెంటనే ఆసుపత్రులో రోగులకు పగులనక, రాత్రనక సేవలందించింది. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి రోగులకు రుచికరమైన ఆహారం అందించింది. 1854-56లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లోరెన్స్ తోటి నర్సులను కూడగట్టుకుని యుద్ధంలో గాయాలైన సైనికులకు విశేష సేవలందించింది. వారికి ధైర్యం చెప్పింది. సాటి నర్సులు వారిని విసుక్కునేవారు. ఏ పని దొరక్క ఈ పనికి వచ్చాం అనేవారు. కానీ ఎంతో ధనిక కుటుంబంలో నుంచి వచ్చిన ఆమె ఈ పనిని ఎంతో శ్రద్దతో, ఇష్టంతో చేసేది. ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మచీకట్లో కూడా చిరుదీపం వెంట తీసుకుని వెళ్లి సేవలు చేసేది. రోగుల ముఖం మీద చిరునవ్వు ఆమె చేతిలో దీపంలాగా వెలిగేది. మొదట్లో ఆమెను చూసి అధికారులు మండిపడేవారు. ఆమె నిరుపమానమైన సేవకు తర్వాత ముగ్దులయ్యారు. ఆసుపత్రులకు చోటు లేకపోతే పాత ఇళ్ళు, భవంతులను అధికారుల సహాయంతో ఆసుపత్రులగా మార్చేది. రాత్రుల్లో రెండు మూడు గంటల మాత్రమే పడుకుని మిగిలిన సమయం సేవలకే పరిమితం అయింది. తాను అనారోగ్యంతో ఉన్న సైనికులకు సేవలు అందించింది. తాగుడుకు డబ్బు ఖర్చు పెట్టకండి, మీ ఇళ్లకు పంపండి వారి భుక్తి గడుస్తుందని సైనికులకు చెప్పేది. గ్రంథాలయాలు చదువుకునే గదులు అందరికి అందుబాటులో ఉండేటట్లు చూసి అక్షరాస్యతను పెంచింది. ఆమె నోట్స్ ఆన్ హాస్పిటల్స్, నోట్స్ ఆన్ నర్సింగ్ అనే గ్రంథాలను కూడా రాసింది. రాయడమే కాకుండా విక్టోరియా రాణికి, ప్రభుత్వ అధికారులకి హాస్పిటల్స్ బాగు చేయాలని అభ్యర్ధనలను పంపింది. అప్పటి నుంచే నర్సులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వడం ప్రారంభమైంది. 1860 జూన్ 24న నైటింగేల్ ట్రైనింగ్ స్కూల్ ఫర్ నర్సస్ అనే సంస్థను లండన్‌లో స్థాపించారు. ఆమెను మథర్ ఆఫ్ మోడరన్ నర్సింగ్‌గా గుర్తించారు. భారతదేశానికీ ఆమె ఇతోధిక సేవలందించింది. 1859ల విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కోసం ఒక కమిషన్ నియమించింది. చెన్నయ్ నగరపు మేయరు ఆడ నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. నగర పారిశుద్యం మెరుగుపడింది. ఫ్లారెన్స్ సలహాలతో మన దేశంలో మరణాల రేటు తగ్గింది. 1910 ఆగస్టులో ఫ్లారెన్స్ మరణించింది. సేవా నిరతిగల ప్రతి నర్సులోనూ ఆమె కలకాలం జీవించి ఉంటుంది. నర్సులు, రోగులు గుర్తించుకోవాల్సిన ఆదర్శమూర్తి నైటింగేల్. మళ్లి ఒక ఫ్లారెన్స్ పుట్టి మన ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి మెరుగు పడాలని కోరుకుందాం.

సేవే వారి జీవితం : ప్రభావతి, అసిస్టెంట్ డైరెక్టర్ (నర్సింగ్), స్విమ్స్.



నర్సులు. ఈ పేరు తెలియని వారు ఎవ్వరూ ఉండరు. ప్రతి ఆసుపత్రులో రోగికి ముందుగా ఎదురొచ్చేది, నిత్యం రోగితో ఉండేది. ఆరోగ్యంతో తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో చిరునవ్వుతో వీడ్కోలు పలికే వరకు రోగిని అంటుపెట్టుకుని ఉండేది నర్సే. వైద్యుల సలహాలు, సూచనలు క్రమం తప్పకుండా పాటిస్తూ రోగిని సంపూర్ణ ఆరోగ్యవంతులు చేయడంలో నర్సుల పాత్ర కీలకం. సేవే వారి జీవితం. నిస్వార్ధ సేవలందించే నర్సులు రోగులకు ఎప్పటికీ గుర్తుంటారు. అంతర్జాతీయ నర్సులు దినోత్సవం సందర్భంగా నర్సులకు శుభాకాంక్షలు.

నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : పి.అరుణమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1, రుయా ఆసుపత్రి



ఫ్లారెన్స్ నైటింగేల్ 19వ శతాబ్దంలో నర్సింగ్ వ్యవస్థకు గుర్తింపు తీసుకురావాడంలో ఎంతో కృషి చేసింది. రాత్రుల్లో లాంతరు వెలుతురులో యుద్దంలో గాయపడిన సైనికులకు ఎంతో ఉదారస్వభావంతో, అంకితభావంతో సేవలందించి, ఒక గొప్ప నర్సుగా పేరు తెచ్చుకుంది. అందుకే ఆమెను నూతన నర్సింగ్ విధాన రూపకర్తగా అభివర్ణిస్తారు. అటువంటి గొప్ప సేవకురాలిని నేటి నర్సింగ్ అధికారులు, నర్సులు, నర్సింగ్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి. నర్సులకు అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు.

రేణిగుంటలో ట్రాన్స్ పోర్ట్ రాయలసీమ జోన్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -రేణిగుంట

మండల కేంద్రమైన రేణిగుంట సమీపంలో ట్రాన్స్ పోర్ట్ రాయలసీమ రీజియన్ జాయింట్ కమిషనర్ కార్యాలయాన్ని గురువారం జాయింట్ కమిషనర్ బసిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రేణిగుంట , శ్రీకాళహస్తి ప్రధాన రహదారి గురవరాజు పల్లి సమీపంలో నిర్మించిన భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ పోర్ట్ శాఖకు కేటాయించింది. దీంతో జాయింట్ కమిషనర్ బసిరెడ్డి ఆధ్వర్యంలో నూతన భవనంలో, వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బసిరెడ్డి మాట్లాడుతూ 8 జిల్లాలకు సంబంధించి, సౌత్ జోన్ ట్రాన్స్ పోర్ట్ కార్యాలయంగా విధులు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు . రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదేశాల మేరకు జోన్ పరిధిలోని ట్రాన్స్ పోర్ట్, రెవెన్యూ, ఉద్యోగుల పరిపాలనపై ఇకమీదట తమ కార్యాలయంలో విధులు సాగుతోందని జాయింట్ కమిషనర్ బసిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిటిసి నిరంజన్ రెడ్డి, తిరుపతి డిటిఓ సీతారామి రెడ్డి, తిరుపతి, రేణిగుంట, పుత్తూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు, మదనపల్లి, తదితర ప్రాంతాలకు చెందిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.





అన్నమయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి : మధుసూదన్

ప్రజాశక్తి - క్యాంపస్

సంగీత, సాహిత్య, మాండలిక, భక్తి రంగాల్లో అపారమైన జ్ఞానం ఉన్న శ్రీ అన్నమయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ పాత్రికేయులు మధుసూదన్ అన్నారు. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న సాహితీ సదస్సులు గురువారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన మధుసూదన్ '' అన్నమయ్య - బహుముఖ ప్రజ్ఞ '' అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య కీర్తనల్లో వేదం, ఉపనిషత్తులు, శాస్త్రం , మంత్రం, వ్యవసాయం, వాడుక భాషలోని సామెతలు, పలుకుబడులను ఉపయోగించి పామరులకు సైతం అర్థమయ్యేలా రచనలు చేశారని కొనియాడారు. జానపద బాణీలో రాసిన జోలపాటలు, చందమామ పాటలు ఎంతో ప్రాచుర్యం పొందాయని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య వెంకట రామకష్ణ శాస్త్రి అన్నమయ్య - వ్యాకరణ ప్రయోగాలు అనే అంశంపై ఉపన్యసించారు. విజయవాడకు చెందిన డాక్టర్ శ్యామలానంద ప్రసాద్ 'అన్నమయ్య - మాండలికాలు' అనే అంశంపై మాట్లాడారు. సాయంత్రం ఆరు గంటల నుండి తిరుపతికి చెందిన అన్నపూర్ణ బందం గాత్ర సంగీతం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు నెల్లూరుకు చెందిన దుర్గాప్రసాద్ బందం హరికథ పారాయణం చేశారు.

14 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ : చెవిరెడ్డి

ప్రజాశక్తి - చంద్రగిరి

చంద్రగిరి నియోజకవర్గంలో ఈనెల 14వతేదీ నుంచి జరగనున్న వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ ను విజయవంతం చేయాలంటే కలిసికట్టుగా పనిచేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కోరారు. గురువారం తుమ్మలగుంట క్రికెట్ క్రీడామైదానంలో పార్టీ నేతలు, క్రికెట్ పై అవగాహన కలిగిన వారితో సమావేశమైన ఎమ్మెల్యే చెవిరెడ్డి టోర్నమెంట్ నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఆయా డివిజన్ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత తీసుకుని పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరినీ టోర్నమెంట్ ప్రారంభం రోజున తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మలగుంట సమీపంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద క్రీడామైదానంలో ఈనెల 14 నుంచి టోర్నమెంట్ ప్రారంభం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే ప్రాంగణంలో 12 మైదానాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క మైదానంలో ప్రతి రోజు నాలుగు మ్యాచ్ ల చొప్పున 70కి పైగా మ్యాచ్ లను నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు వెయ్యి టీములు (15 వేల మంది క్రీడాకారులు)తో పాటు మరో 10వేల మంది పోటీలను తిలకించడానికి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ రీతిలో పార్కింగ్ ఏర్పాట్లు, క్రీడాకారులకు అవసరమైన వాటర్ బాటిళ్లు, ఎనర్జీ డ్రింక్, అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనంను సరఫరా చేయనున్నట్టు తెలిపారు. అందరికీ రుచికరమైన భోజనాలు అందించాలన్నారు.



ఉత్సాహభరితంగా వేసవిలో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి -తిరుపతి అర్బన్

స్థానిక అన్నమయ్య సర్కిల్ నందు (ఆల్ ఇండియా రేడియో వెనకాల) వున్న ప్రభుత్వ గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయం తిరుపతి నందు గురువారం ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహభరితంగా సాగుతోంది. ఆయుర్వేద కళాశాల లెక్చరర్ డాక్టర్ చంద్రకిశోరె ధాగె, అడ్వకేట్ మౌనిక ధాగె స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు వ్యక్తిత్వ వికాసంపై లెక్చర్ ఇచ్చారు. మంచి అలవాట్లు, లక్షణాలు ఎలా పెంపొందించుకోవాలనే విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఎస్వీయూ రిటైర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.గోపాల్ స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై వివరించారు. ప్రముఖ రచయిత నీతికథలు, తెలుగు పద్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో తహసున్నిసా బేగం, గ్రంథాలయాధికారి జె.శివప్రసాద్, జీవన్, మునీంద్ర, గోవిందు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి నాయకులు

ప్రజాశక్తి -తొట్టంబేడు

తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామంలో నరసింహ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పూడి గ్రామానికి చెందిన బీజేపీ వార్డ్ మెంబర్ జగదీష్, నేతాజీ, లక్ష్మీపతి, బాలరాజు తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పూడి నరసింహ నాయుడు, వడ్లతాంగల్ బాలాజీ రెడ్డి, మురళి యాదవ్, గురవయ్య పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని డి.ఎన్. ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియం లో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో రోటరీ చేయూత కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షులు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ రోటరీ చేయూత కార్యక్రమం ద్వారా ప్రతి నెలా క్రమం తప్పకుండా సరుకులు అందచేయటం జరుగుతుందని తెలిపారు. క్లబ్ సభ్యులు దాతల సహకారంతో ఈ సంవత్సరం 70 సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు తాళ్ళూరు శ్రీనివాసులు , వాసు గౌడ్ , బలరాం రెడ్డి పాల్గొన్నారు.



ఇళ్లపట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సంపూర్ణ గహ పట్టాలను పట్టణంలోని పల్లూరు. పిళ్లారి పట్టు , యన్ జి ఓ కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, అంబేడ్కర్ సర్కిల్ సచివాలయాల పరిధిలో 168 మందికి అందజేశారు.కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, మంత్రి ఆర్‌కె రోజా సోదరులు వై.కుమారస్వామిరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'వై ఎస్ ఆర్ కంటి వెలుగు' పై దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

సుస్థిర అభివద్ధి లక్ష్యాలలో భాగంగా రక్తహీనత కలిగిన వారిపై ప్రత్యేక దష్టి పెట్టాలని, పౌష్టిక ఆహారం తీసుకునేలా ఐ సి డి ఎస్, వైద్య శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె .జవహర్ రెడ్డి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సుస్థిర అభివద్ధి లక్ష్యాలపై, సచివాలయాల్లో అందిస్తున్న పౌర సేవలపై సమీక్ష నిర్వహించగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్, జేసి డి కె బాలాజీ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

తెలుగుగంగ కాల్వలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి- తొట్టంబేడు

తెలుగు గంగ కాలవలో పడి విద్యార్థి గల్లంతైన సంఘటన తొట్టంబేడు మండలంలోని పొయ్యి పంచాయితీ గురుకుల పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పెద్ద సింగమాల గ్రామానికి ఆనుకొని తెలుగు గంగ కాలువ ఉంది. ఆ కాలువ బ్రిడ్జి వద్దకు గురుకుల పాలెం గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు సరదాగా ఈతకు వెళ్లారు. వారిలో రూపేష్ (15) కు ఈతరాదు. మెట్లపై కూర్చొని ఆడుకుంటూ కాలుజారి ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. రూపేష్ స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో కాలువ వద్దకు వచ్చేసరికి రూపేష్ మునిగిపోయాడు. గురుకుల పాలెం గ్రామానికి చెందిన కట్ట శ్రీరాములు, సక్కమ్మలకు ఇద్దరు కూతుర్లు, ఒకే కుమారుడు రూపేష్. పెద్ద కన్నలి హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానీ ఒక్క కొడుకును తెలుపుగంగ బలి తీసుకుందని గుండెలు బాదుకుంటూ ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గల్లంతైన రూపేష్‌ను బయటకు తీయడానికి కాలవలో దిగి గాలిస్తున్నారు. వైసీపీ మండల అధ్యక్షులు వాసుదేవ నాయుడు ఉన్నతాధికారులతో మాట్లాడి నీటిని తగ్గించడానికి ప్రయత్నిస్తూ గాలిస్తున్నారు.

పౌష్టికాహారం పంపిణీలో లోపాలు ఉండకూడదు : మంత్రి ఉషాశ్రీచరణ్

ప్రజాశక్తి-చంద్రగిరి

తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా రేణుగుంట, చంద్రగిరి మండల పరిధిలోని రెడ్డివారిపల్లి గ్రామం, వెంకటంపేటలో అంగన్‌వాడీ సెంటర్లను రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు కెవి ఉషాశ్రీచరణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మౌలిక వసతులు, పిల్లలకు అందిస్తున్న విద్య, గర్భిణీ, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

బాలాజీ ఏజెన్సీ అండ్ ఇండస్ట్రీస్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఆ సంస్థ ఉద్యోగి షేక్ అల్లాఉద్దీన్ కుటుంబానికి ఆ సంస్థ ఆధ్వర్యంలో 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక 150 బైపాస్‌రోడ్డులోని మహింద్ర కంపెనీ షోరూమ్ వద్ద జరిగిన కార్యక్రమంలో బాలాజీ ఏజెన్సీ అండ్ ఇండస్ట్రీస్ ఎండి ఎ.రవీంద్రనాథ్ మాట్లాడుతూ తమ సంస్థకు చెందిన మదనపల్లి బ్రాంచిలో షేక్ అల్లాఉద్దీన్ ఏడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. గత ఏడాది డిసెంబరులో మదనపల్లి సమీపంలోని అంగళ్లు నుంచి విధులకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నాడన్నారు. తమ సంస్థను ఆదరించే వినియోగదారులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, అదే నేపథ్యంలో కస్టమర్లకు సేవలందించే పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి తాము ప్రాధాన్యత ఇస్తామన్నారు. దాని ద్వారా ప్రమాదంలో మృతి చెందిన అల్లాఉద్దీన్ కుటుంబానికి 10 లక్షల రూపాయలు మంజూరయ్యాయని, చనిపోయిన మనిషిని ఎలాగూ తీసుకురాలేము, కానీ ఆయన కుటుంబానికి కాస్త భరోసా ఇచ్చేందుకు కృషి చేస్తూ, ఈ పరిహారాన్ని అందిస్తున్నామన్నారు. అనంతరం మృతుని భార్య షేక్ షకీనాకు 10 లక్షల రూపాయల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సిఈవో బి.కిరణ్మయి, జిఎం శ్రీనివాసులు, మేనేజరు అబ్దుల్, అబీబ్, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు ఎస్.రాజసింహ, కె.రేణుబాబు, ఎం.కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ క్రికెట్ కోచ్‌కు సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి మహతి ఆడిటోరియంలో గురువారం శ్రీ వంశీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన మెగా సంబరాలు 2022-2023 గోల్డెన్ అవార్డ్స్ కార్యక్రమంలో తిరుపతిలో సుప్రసిద్ధ క్రికెటర్ గా పేరుగాంచిన జిలానికి 'బెస్ట్ క్రికెట్ కోచ్' అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ పోరాట సమితి నాయకులు, జిలాని చిన్ననాటి స్నేహితుడు నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రత్యేకంగా శాఖలు, నామినేటెడ్ పదవులు ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తున్నా రాజకీయ జోక్యంతో నిధులు పక్కదారి పడుతున్నాయన్నారు. క్రికెట్‌పై మక్కువతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని యువత తల్లిదండ్రుల ప్రోత్సాహంతో, నైపుణ్యంతో కష్టపడి రాణిస్తున్నా రాజకీయ అండదండలు, ఆర్థిక స్తోమత లేక గుర్తింపు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మట్టిలో మాణిక్యాల" లా ఎంతోమంది క్రీడాకారులు సరైన ప్రోత్సాహం లేక నిరాశతో క్రీడలకు స్వస్తి పలుకుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్‌తో పాటు ఇతర క్రీడాకారులను కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ పాల్గొన్నారు.

షేర్‌ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్





మండలంలోని షేర్ ఆటోల డ్రైవర్లతో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, నియోజకవర్గ నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటయ్యింది. ఆటో యూనియన్ కు గౌరవ అధ్యక్షులుగా ఆర్ వెంకటేశ, అధ్యక్షులుగా ఏ సుధాకర్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా రామ్ లింగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రమేష్, మహేష్, మురుగన్, వేలాయుధంను ఎన్నుకున్నారు

ఎంఇఒను సస్పెండ్ చేయాలి

పెళ్లకూరు : మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మ దగ్గర తెల్లకాగితంపై సంతకం చేసుకుని ఆమె పొట్టకొట్టిన ఎంఇఒను సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ముకుంద డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మకు మద్దతుగా 'చలో ఓజిలి' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లాలోని అన్ని మండలాల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలి వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సుగుణమ్మ, సుబ్బమ్మ, చంగమ్మ, సుమతి, రమణమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

